

డిగ్రీలో ప్రవేశాలు అంతంతే.. 2



2 అమ్మ పేరుతో మొక్క నాటాలి



9న దేశవ్యాప్త సమ్మె 2

www.aksharatoday.com
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND

## యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

**అక్షటుడే, కామారెడ్డి:** మత్తు పదార్థాలు యువత భవిష్యత్తును నాశనం చేస్తాయని ఎస్పీ రాజేష్ చంద్ర అన్నారు. డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా కామారెడ్డిలో ఈ నెల 26న ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

24-6-2025 (TUESDAY) NIZAMABAD/KAMAREDDY EDITION PAGES-2

## నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్‌గా రవిబాబు

**అక్షరటుడే, ఇందూరు/బోధన్:** రాష్ట్రంలో భారీ సంఖ్యలో మున్సిపల్ కమిషనర్లు, డిప్యూటీ కమిష నర్లు బదిలీ అయ్యారు. ఈమేరకు మున్సిపల్ కార్యదర్శి శ్రీదేవి ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌కు డిప్యూటీ కమిషనర్‌ను కేటాయించారు. అమరచింతలో గ్రేడ్–1 మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న రవిబాబును నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్‌గా బదిలీ చేశారు. అలాగే అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్‌గా ఎంఏ నసీర్ ప్రమోషన్‌పై రానున్నారు. త్వరలో వీరిరువురు బాధ్యతలు స్వీకరించనున్నారు.

### బోధన్ మున్సిపల్ కమిషనర్‌గా వేణుగోపాల్

బోధన్ మున్సిపల్ కమిషనర్ వెంకటనారాయణ బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా వెంకట నారాయణను రంగారెడ్డి జిల్లాకు ట్రాన్స్‌ఫర్ చేశారు. బోధన్ కమిషనర్‌గా వేణుగోపాల్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

## నెట్ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు



**అక్షరటుడే నిజామాబాద్ సిటీ:** యూజీసీ–ఎన్ఈటీ పరీక్షకు జిల్లాలో పకడ్బందీ ఏర్పాట్లు చేశామని సీపీ సాయి చైతన్య పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. నిజామాబాద్ డివిజన్‌లోని పరీక్ష జరిగే కేంద్రాల వద్ద సెక్షన్ 163 బీఎన్ఎస్ అమలులో ఉంటుందని వెల్లడించారు. ఈనెల 25 నుంచి 29 వరకు ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నగరంలోని మున్నూరుకాపు సంఘం, అర్సపల్లి బైపాస్‌రోడ్డులో ఉన్న పరీక్ష కేంద్రాల వద్ద నిషేధాజ్ఞలు ఉంటాయని స్పష్టం చేశారు. ఆయా కేంద్రాల సమీపంలో ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది గుమిగూడి ఉండరాదన్నారు. నిషేధిత వస్తువులతో పరీక్ష కేంద్రాల వద్ద తిరగవద్దని సూచించారు.



**ఫోన్ ట్యాపింగ్ కేసు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కామారెడ్డి జిల్లా కేంద్రంగా కూడా ఫోన్ ట్యాపింగ్ సాగిందనే ఆరోపణలు ఉన్నాయి. అయితే తాజాగా.. ట్యాపింగ్ జరిగిన విషయంలో వాంగ్మూలం ఇవ్వడానికి రావాలని సిట్ అధికారుల నుంచి పలువురికి పిలుపు వచ్చింది. ఈ నేపథ్యంలో నాటి అధికార పార్టీ నేతల్లో కలవరం మొదలైంది.**

**- అక్షరటుడే, కామారెడ్డి**

# కారులో కలవరం!

- కామారెడ్డి కేంద్రంగా ఫోన్ ట్యాపింగ్ జరిగినట్లు గతంలో ప్రచారం
- వాంగ్మూలం కోసం జిల్లా నేతలకు సిట్ అధికారుల ఫోన్లు
- ఈ వ్యవహారంపై గులాబీ నేతల్లో ఆందోళన

కామారెడ్డి జిల్లా కేంద్రంగా కూడా ఫోన్ ట్యాపింగ్ జరిగిందనే ఆరోపణలు మరోసారి తెరపైకి వస్తున్నాయి. మాజీ సీఎం కేసీఆర్ ఇక్కడి నుంచి పోటీ చేయడంతో ఇక్కడి నేతల కదలికలపై నిఘా పెట్టారన్న ప్రచారం జోరుగా సాగింది. ప్రస్తుతం వరుసగా నేతలకు సిట్ నుంచి పిలుపు రావడంతో మరోసారి కామారెడ్డి రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

### బీఆర్ఎస్ నేతల్లో గుబులు

గత అసెంబ్లీ ఎన్నికల్లో గజ్వేల్‌తో పాటు కామారెడ్డి నియోజకవర్గం నుంచి కూడా మాజీ సీఎం కేసీఆర్ పోటీ చేశారు. కేసీఆర్ ఎక్కడ పోటీ చేస్తే అక్కడ తాను పోటీచేసి కేసీఆర్‌ను ఓడించి తీరతానని.. ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి సైతం కొడంగల్‌తో పాటు కామారెడ్డి నుంచి పోటీ చేసిన విషయం తెలిసిందే. కాగా.. బీజేపీ నేత కాటిపల్లి వెంకట రమణా రెడ్డి ఎమ్మెల్యేగా గెలిచారు. అయితే కేసీఆర్ గెలుపు కోసం నాడు కామారెడ్డిలో ప్రత్యేకంగా వార్‌రూం ఏర్పాటు చేసినట్లుగా ప్రచారం సాగింది. అదే వార్ రూమ్ నుంచి ప్రత్యర్థి పార్టీ నేతల కదలికలను గమనించడం కోసం ఫోన్ ట్యాపింగ్ చేశారనే ఆరోపణలు వచ్చాయి. ఈ వ్యవహారాన్ని జిల్లాకు చెందిన బీఆర్ఎస్ ముఖ్య నాయకులే చూసుకున్నారని ప్రచారం సాగింది. ఈ క్రమంలో మళ్లీ తెరపైకి కామారెడ్డి వ్యవహారం రావడంతో ఇక్కడి బీఆర్ఎస్ నేతలకు టెన్షన్ పట్టుకుందన్న ప్రచారం సాగుతోంది. నాడు తమ అధినేత గెలుపు కోసం పార్టీ చెప్పినట్టు చేశామని, ఇప్పుడు ఫోన్ ట్యాపింగ్‌లో మా పేర్లు వస్తే ఎలా అని సన్నిహితుల వద్ద వాపోతున్నట్టు తెలుస్తోంది.

### కాంగ్రెస్ నేతలపై నిఘా

రేవంత్‌రెడ్డి గెలుపుకోసం ఆయన సోదరుడు కొండల్ రెడ్డి ఇక్కడే మకాం వేసి గెలుపు కోసం కృషి చేశారు. నాయకుల మధ్య సఖ్యత, ఇతర వ్యవహారాలన్నీ ఆయనే చూసుకున్నట్లు అప్పట్లో ప్రచారం సాగింది. దాంతో కామారెడ్డికి చెందిన కాంగ్రెస్ నేతల ఫోన్లను ట్యాప్ చేసి నిఘా పెట్టడం వల్లనే.. ఆ పార్టీ మండలాధ్యక్షుడు గూడెం శ్రీనివాస్ రెడ్డి కన్‌స్ట్రక్షన్ కార్యాలయంలో ఐటీ రైడ్స్ జరపగా రూ.58 లక్షలు సీజ్ చేశారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. దాంతో పాటు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన గడ్డం చంద్రశేఖర్ రెడ్డి నివాసంలో అర్ధరాత్రి సోదాలు నిర్వహించారు. అలాగే సీఎం సోదరుడు కొండల్ రెడ్డి ఉంటున్న నివాసం వద్ద కూడా సోదాలు చేసేందుకు యత్నించారన్న టాక్ ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

### సిట్ లిస్టులో ఎంతమంది ఉన్నారో..

తాజాగా కామారెడ్డి కాంగ్రెస్ నేతలకు సిట్ అధికారుల నుంచి ఫోన్లు రావడం చర్చనీయాంశంగా మారింది. ఫోన్ ట్యాపింగ్ విషయంలో వాంగ్మూలం ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ లీగల్ అడ్వైజర్ దేవరాజు గౌడ్, టీపీసీసీ జనరల్ సెక్రెటరీ గడ్డం చంద్రశేఖర్ రెడ్డిలకు పిలుపు రావడంతో ప్రస్తుతం మరోసారి కామారెడ్డి వార్ రూమ్ అంశం తెరపైకి వస్తోంది. ఫోన్ ట్యాపింగ్ జరిగిందని వచ్చిన ఆరోపణలలో సిట్ జాబితాలో ఇంకా ఎంతమంది పేర్లు ఉన్నాయో, ఎవరెవరిని సిట్ విచారిస్తుందోనన్న చర్చ పొలిటికల్ సర్కిళ్లలో జోరుగా సాగుతోంది. సిట్ వద్దకు వెళ్లే నేతలు ఎవరిపై అనుమానం వ్యక్తం చేస్తారో.. ఎవరి పేర్లు బయటకు వస్తాయోనని బీఆర్ఎస్ నేతలు టెన్షన్ పడుతున్నారు.

## రైతులకు సరిపడా అందుబాటులో ఎరువులు



**అక్షరటుడే, ఇందూరు:** ఖరీఫ్ సాగుకు అవసరమైన ఎరువులు, విత్తనాలు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. డిచ్‌పల్లిలోని ఎరువులు, విత్తన విక్రయ కేంద్రమైన గ్రోమోర్ సెంటర్‌ను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్, ఇన్వాయిస్ బుక్, బిల్‌బుక్, విత్తన బస్తాలపై లాట్ నెంబర్, గడువు తేదీ తదితర వివరాలను పరిశీలించారు. ఎరువులు, విత్తన అమ్మకాలకు తగిన అనుమతులు పొందిన పత్రాలను తనిఖీ చేశారు. జిల్లావ్యాప్తంగా ఎక్కడ కొరత లేకుండా రైతులకు ఎరువులు అందుబాటులో ఉండేలా చూడాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలని సూచించారు. జిల్లాలోని అన్ని ఎరువులు, విత్తన కేంద్రాల్లో క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని అన్నారు. నకిలీ ఎరువులు, విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయాధికారి వీరాస్వామి, తహశీల్దార్ సతీష్ రెడ్డి, మండల వ్యవసాయాధికారిణి సుధా మాధురి తదితరులున్నారు.

## ఎల్లారెడ్డి ఇన్‌ఛార్జి ఆర్డీవోగా వీణ



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి ఇన్‌ఛార్జి ఆర్డీవోగా కామారెడ్డి ఆర్డీవో వీణ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆర్డీవో కార్యాలయంలో మంగళవారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఎల్లారెడ్డి ఆర్డీవోగా పనిచేసిన మన్నె ప్రభాకర్ ఇటీవల పదవీ విరమణ పొందారు. దీంతో బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి బాధ్యతలు తీసుకున్నారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రస్తుతం ఇన్‌ఛార్జి బాధ్యతలను వీణ తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని ప్రజలకు అందుబాటులో ఉంటూ, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.




ఎల్లారెడ్డి బస్టాండ్‌ను ప్రారంభించిన అనంతరం మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

## ఆర్టీసీకి జీవం పోశాం: మంత్రి పొన్నం

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** గత బీఆర్ఎస్ పాలనలో ఆర్టీసీ మనుగడను ప్రశ్నార్థకంగా చేశారని.. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే జీవం పోసిందని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఎల్లారెడ్డి పట్టణంలో నూతన బస్టాండ్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మహాలక్ష్మి పథకాన్ని అమలు చేసి మహిళలకు ఉచితంగా ప్రయాణ సౌకర్యం కల్పించామన్నారు. ఏడాది దాటినా పథకం నిరాటంకంగా కొనసాగుతోందని.. కోట్లమంది మహిళలు ఉచిత పథకాన్ని వినియోగించుకున్నారని వివరించారు. ఎల్లారెడ్డికి బస్‌డిపో కావాలని ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు కోరారని.. సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తామని ఆయన వివరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ రాజేష్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.



## అమ్మ పేరుపై మొక్క నాటండి

**అక్షరటుడే, ఇందూరు:** బలిదాన్ దివస్ కార్యక్రమంలో భాగంగా పెరుగుతున్న కాలుష్యాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రతిఒక్క రూ అమ్మ పేరు మీద ఒక మొక్కను నాటాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్య నారాయణ గుప్తా పిలుపునిచ్చారు. బీజేపీ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్యామా ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ సందర్భంగా దుబ్బ చౌరస్తాలో మంగళవారం మొక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.




## 9న దేశవ్యాప్త సమ్మె

**అక్షరటుడే, ఇందూరు:** కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జాతీయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చినట్లు మున్సిపల్ కార్మిక సంఘాల జేఏసీ నాయకులు తెలిపారు. మంగళవారం ఏఐటీయూసీ, సీఐటీయూ, టీయూసీఐ నాయకులు నగర పాలక సంస్థ కార్యాలయంలో సమ్మె నోటీ సులను అందజేశారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**అక్షరటుడే, ఆర్మూర్ :** నందిపేట్ మండలంలోని షాపూర్, ఖుదావంద్ పూర్, వన్నెల్ కె, సిద్దాపూర్ గ్రామాల్లో పలువురికి కాంగ్రెస్ నాయకులు మంగళవారం సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. అనిత రూ.16వేలు, తేజ రూ.60వేలు, వనిత రూ.20వేలు, భూమన్న రూ.15,500 చెక్కులను అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్య క్షుడు మహిపాల్, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రశాంత్ తదితరులున్నారు.

## బ్రహ్మజ్ఞాన వైదిక పీఠం వ్యవస్థాపకులు బ్రహ్మరుషి ఇకలేరు



**అక్షరటుడే, ఇందూరు:** నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి స్టేషన్ సమీపంలోని గాంధీనగర్లో గల బ్రహ్మరుషి ఆశ్రమ వ్యవస్థాపకులు బ్రహ్మరుషి (బైస పెద్ద హన్మాండ్లు)(95) సోమవారం(23-06-2025) కాలం చేశారు. మంగళవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. బ్రహ్మరుషి ఇటీవల 'బ్రహ్మజ్ఞాన వైదిక పీఠం' పేర ట్రస్టు స్థాపించి, తన కుమారులు అయిదుగురిని ట్రస్టీలుగా నియమించారు. ఆయన భార్య కళాపరిపూర్ణ మాత తన పేరున ఉన్న సుమారు ఎకరం భూమిని ట్రస్టుకు విరాళంగా సమర్పించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలకు, యోగా విద్య శిక్షణకు, ఏటా పది మంది నిరుపేద ఇంటర్ విద్యార్థులకు రెండేళ్ల పాటు నెలకు రూ. 500 చొప్పున పారితోషికం ఇచ్చేలా ట్రస్టును తీర్చిదిద్దారు.

జిల్లాలోని డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాల సంఖ్య తక్కువగా నమోదవుతోంది. రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు దోస్త్ ప్రక్రియ కొనసాగుతున్నప్పటికీ బాన్సువాడలోని దాదాపు అన్ని కళాశాలల్లోనూ సీట్లు ఖాళీగానే ఉన్నాయి. ముఖ్యంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలు మరీ తక్కువగా కనిపిస్తున్నాయి.

- అక్షరటుడే, బాన్సువాడ

# డిగ్రీలో ప్రవేశాలు అంతంతే..




• కళాశాలల్లో అరకొర ప్రవేశాలు • ఆసక్తి చూపని విద్యార్థులు • అవగాహన కల్పించని కళాశాలల యాజమాన్యాలు

డిగ్రీ కోర్సుల్లో చేరేవారి సంఖ్య ఏడాదికేడాది పడిపోతూ వస్తోంది. కోర్సుల్లో ప్రవేశాల కోసం విద్యార్థులు ఆసక్తి చూపట్లేదని అధ్యాపకులు పేర్కొంటున్నారు. కొత్త విద్యా విధానం వల్ల డిగ్రీ కోర్సులపై ఆసక్తి తగ్గడం కారణంగా కళాశాలల్లో సీట్లు మిగిలిపోతున్నాయని వారంటున్నారు. ప్రవేశాల కోసం ఆయా డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంది. బాన్సువాడ ఎస్ఆర్ఎన్ కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒకప్పుడు విద్యార్థులకు సీటు దొరకడమంటే గగనంగా ఉండేది. తల్లిదండ్రులు పైరవీలు చేసి తమ పిల్లల కోసం సీట్లు దక్కించుకున్న సందర్భాలున్నాయి. కాని ప్రస్తుతం కళాశాలలో సీట్లు చాలావరకు మిగిలే ఉన్నాయి.

జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో దోస్త్ రెండో విడత ప్రవేశాల సంఖ్య అరకొరగా కనిపిస్తోంది. రెండు విడతలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లోని 3,220 సీట్లకు గాను 644 (20శాతం) విద్యార్థులు మాత్రమే కౌన్సెలింగ్‌లో దరఖాస్తు చేసుకున్నారు. చాలామంది విద్యార్థులు దరఖాస్తు చేసినా వెబ్ ఆప్షన్లు ఎంచుకోకపోవటంతో సీట్ల కేటాయింపు జరగలేదు. సీట్లు పొందిన విద్యార్థులు ఆయా కళాశాలల్లో రిపోర్ట్ చేస్తేనే సీట్లు కేటాయించినట్లు ప్రభుత్వం ధ్రువీకరిస్తుంది.

| ప్రాంతాలు | భర్తీ అయిన సీట్లు | మొత్తం సీట్లు |
|---|---|---|
| కామారెడ్డి | 250 | 1080 |
| బాన్సువాడ | 209 | 900 |
| ఎల్లారెడ్డి | 80 | 660 |
| బిచ్కుంద | 105 | 580 |

### వెలవెలబోతున్న ప్రైవేట్ కళాశాలలు

ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పరిస్థితి ఇలా ఉంటే ప్రైవేట్ డిగ్రీ కళాశాలల్లో కొన్నేళ్లుగా విద్యార్థులు చేరడంలేదు. దీంతో ఎల్లారెడ్డి, బిచ్కుంద, పిట్లం, మద్నూర్ తదితర ప్రాంతాల్లో కళాశాలలు మూతపడ్డాయి. కొన్ని ప్రైవేట్ కళాశాలల్లో 100 మందిలోపు విద్యార్థులు చేరుతుండటం గమనార్హం. ఒకప్పుడు ప్రతి కళాశాలలోనూ 500 ప్రవేశాలు ఉండేవి. బోధన రుసుములు భారమవటం, నిర్వహణ కష్టంగా మారటంతో ప్రైవేటు కళాశాలల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది.

## దేగాంలో టీబీ ముక్త్ భారత్ అభియాన్



**అక్షరటుడే, ఆర్మూర్ :** ఆలూర్ మండలంలోని దేగాం పీహెచ్‌సీలో మంగళవారం టీబీ ముక్త భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వంద రోజుల ప్రత్యేక కార్యాచరణలో భాగంగా కార్యక్రమం చేపట్టినట్లు డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేష్ తెలిపారు. గతంలో టీబీ బాధితులుగా నమోదైనవారికి మరోమారు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలని, వ్యాధి పూర్తిగా నయమైనా మళ్లీ వచ్చే అవకాశం ఉన్న పాత కేసులకు స్క్రీనింగ్ తప్పనిసరి అన్నారు. కార్యక్రమంలో యూనిట్ ఆఫీసర్ సయ్యన్న, ఏఎన్ఎం స్వప్న, టీబీ సూపర్‌వైజర్ సంతోష్, ఆశ వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



**అక్షరటుడే, బాన్సువాడ:** డ్రెయినేజీల్లో చెత్తచెదారం వేయకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆగ్రో ఇండస్ట్రీస్ ఛైర్మన్ కాసుల బాలరాజు సూచించారు. పట్టణంలోని ఒకటో వార్డులో మంగళవారం విస్తృతంగా పర్యటించి డ్రెయినేజీ వ్యవస్థను పరిశీలించారు. వర్షాకాలం వచ్చిందంటే డ్రెయినేజీల్లో చెత్తాచెదారం పేరుకుపోయి నీరు నిలిచిపోతుందని స్థానికులకు వివరించారు. దీంతో దోమలు, ఈగలు వృద్ధి చెందుతాయని, ప్రతిఒక్కరూ తమవంతు బాధ్యతగా డ్రెయినేజీల్లో చెత్తాచెదారం వేయకుండా మున్సిపల్ చెత్త వాహనంలో వేయాలన్నారు. కార్యక్రమంలో అంజి రెడ్డి, నార్ల సురేష్, కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఖాలేఖ్, ఎజాజ్, బాబా, పిట్ల శ్రీధర్, అజీమ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ప్రతిభా పోటీలు



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు డివిజనల్ స్థాయి ప్రతిభా పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా 8,9,10 తరగతుల విద్యార్థులకు మాదక ద్రవ్యాలు-నిర్మూలన అన్న అంశంపై వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఉపన్యాస పోటీల్లో త్రిలోక్(గాంధారి), సౌమ్య(అడవి లింగాల్), అన్సార్ (ఎల్లారెడ్డి), వ్యాసరచన పోటీలో భానుప్రసాద్ (ఎల్లారెడ్డి), శ్రీనిధి(ఎల్లారెడ్డి), నిర్మల జ్యోతి (ఎల్లారెడ్డి) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరికి ఈనెల 26న కలెక్టర్ చేతులమీదుగా బహుమతులు అందించనున్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం, హెచ్ఎం, ఉపాధ్యాయులు ఉన్నారు.

## విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



**అక్షరటుడే, కోటగిరి:** విద్యార్థులకు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్సై సునీల్ సూచించారు. మండల కేంద్రంలోని మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్‌లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం మత్తు పదార్థాలు, సైబర్ క్రైంపై అవగాహన కల్పించారు. మైనర్లు వాహనాలు నడపవద్దని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖాలిక్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కొమురవ్వ, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు తదితరులు, పాల్గొన్నారు.

## న్యూట్రిషన్ పౌడర్ కలిపిన పాలు తాగి ఆస్పత్రి పాలై..

**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** హెర్బల్ ప్రొడక్ట్స్ విక్రయం పేరిట ఓ వ్యక్తి మహిళలను మోసం చేశాడు. ఈ ఘటన నిజామాబాద్ నగరంలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. నగరంలోని రూరల్ పోలీస్ పరిధిలో గల ముబారక్ నగర్‌లో జాబ్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఓ ప్రకటన వచ్చింది. దీంతో ఇద్దరు మహిళలు మంగళవారం ఉదయం ఇంటర్వ్యూకు హాజరయ్యారు. అక్కడికి వెళ్లాక.. హెర్బల్ ప్రొడక్ట్స్ విక్రయించాలని నెలకు రూ.15 వేల జీతం ఇస్తామని ఆ వ్యక్తి చెప్పాడు. కస్టమర్లకు ఫోన్ చేస్తే వారే వచ్చి ప్రొడక్టులు తీసుకువెళ్తారన్నాడు. ఇందులో భాగంగా ఇంటర్వ్యూకు వచ్చిన మహిళల్లో ఇద్దరికి బాదం పాలలో వారు విక్రయించాల్సిన న్యూట్రిషన్ పౌడర్ కలిపి ఇచ్చాడు. ఆ పాలు తాగిన కాసేపటికే సుకన్య, కవిత అనే మహిళలు అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆ వ్యక్తి అక్కడి నుంచి పరారయ్యాడు. విషయం తెలుసుకున్న మహిళల కుటుంబ సభ్యులు వారిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.